
# అసమర్థుడు



ఆదరాబాదరాగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని బస్‌స్టాప్ చేరాడు భాస్కర్. చేతి రుమాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకుని అలవాటుగా పక్కకి చూశాడు. ఆ రెండుజడల అమ్మాయి వాచీ తీసి టైము సరిచేసుకుంటూంది. 'మామూలేగా' అనుకుని ముఖం తిప్పేసుకున్నాడు.

భాస్కరం బస్‌స్టాప్‌లో ఉన్నాడంటే తొమ్మిదింపావు అయిందని అతన్ని ఎరిగిఉన్న వాళ్ళందరికీ తెలుసు! అతను అంత ఖచ్చితంగా ఉంటాడని కాదు. ఆ బస్సు అందుకోవాలని పడే ఆరాటం అటువంటిది. ఆ తొందర అందరికీ ఉన్నా, భాస్కరంమటుకు తన జీవితాన్ని భూతద్దంలో చూసుకుంటాడు. క్యూలో ముందు నిల్చోకపోతే తొమ్మిదిన్నర బస్సుకు అందుకుని అందులో జొరబడలేడు. పావుగంట ముందుగా రాకపోతే క్యూలో మొదటి పదిమందిలో నిల్చోలేడు. ఆ బస్సు దాటిపోతే ఆ తరవాత బస్సు ఆఫీసు టైమ్‌కి అందదు. రోజూ రిక్షాలమీద పోగల జీవితం కాదుకదా! సైకిల్ కొనాలనుకుని గత ఏడాదినుంచీ ప్రయత్నం సాగిస్తూనేఉన్నా ఏదీ ఆ శుభసమయం సమీపించటంలేదు. అంతవరకు తనకీ బస్సుకోసం పడిగాపులు తప్పవు. తనను చూసి ఎవరు వాచీలకి కీలు ఇచ్చుకున్నా, టైమ్‌లు సరిదిద్దుకున్నా ఊరుకోవలిసిందే.

బస్సు సాగుతున్నట్టే భాస్కరం ఆలోచనలు సాగుతున్నాయి. గత సాయంత్రం ఇంటికి వచ్చినప్పటినుండి అతన్ని వేధిస్తున్నది ఒక విషయం. కమల తన బావను ఎందుకు చేసుకోలేదు? తమ వివాహం మనసూర్తిగా అంగీకరించినదేనా? పెద్దల ఒత్తిడి ఏమీ లేదుకదా? ఈ విషయం అయిదారేళ్ళ క్రితం తెలుసుకోవలిసిన సంగతి. ఇప్పుడు, ఇద్దరు పిల్లలు పుట్టాక ఆలోచించవలిసింది కాదు. కాని ఆ అవకాశం ఎప్పుడు కలగలేదు. అంతటి అనుమానమూ రాలేదు. తమ దాంపత్యంలో ఎప్పుడు పొరపాట్లుగాని, కలతలుగాని రాలేదు. అదంతా తమ అదృష్టంగానే భావించుకున్నాడుకాని...కాని... ఏమిటో నిన్న ఉదయం వాళ్ళ బావట ... ఈ ఊరికి బదిలీ అయిందిట ... కారులో భార్యాసమేతంగా వచ్చి, "ఫలానా ఇల్లు ఇదేనా?" అని తెలుసుకుని భార్యని లోపలికి పంపించాడు. తను కుర్చీలో కూర్చుంటూ "మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు. ఏదీ ఆఫీసుపని తీరటంలేదు. ఏవో మొహమాటాలు. ప్రతివాడికీ ఆశే, తనే ఆ ఉద్యోగం కొట్టెయ్యాలని. యోగ్యత ఉండవద్దు జల్లెడ పట్టేసి ఏరేటప్పటికి? మా పని సరే, ఇక ఊపిరిసలపనంత బిగుతుగా ఉంటాయండీ మా పనులు! కమలపెళ్ళికి తప్పకుండా వచ్చేవాణ్ణే. అర్జంటుగా ఆఫీసుపని తగిలింది. మా కమలానికి బాగా కోపం వచ్చేఉంటుంది. అందుకే మా పెళ్ళికి మీ దంపతులు రాలేదు. అవునా?" అన్నాడు. దడదడ మాట్లాడేస్తున్న అతన్ని అయోమయంగా తను చూస్తున్నప్పటి దృశ్యం ఊహించుకుంటే నవ్వు వస్తూంది.

"ఏమిటి, బ్రదర్, ఊహోగానమా? మనం ఇంకా ఆఫీసుకు వెళుతున్నాముగాని ఇంటికి కాదు."

తోటిగుమాస్తా రాజారావు పళ్ళు ఇకిలించి బుగ్గ నున్న కిళ్ళీ సగం కనిపించేలా నవ్వుతూఉంటే గబగబా దిగాడు బస్సు.

యాంత్రికంగా పనిచేస్తున్న భాస్కరం మస్తి

ష్కంలో మళ్ళీ నిన్న ఉదయపు సంఘటనే రీలులా ఆఫీసరైన కమలవాళ్ళ బావకు — అప్పటి అతని వేషం

తిరగటం మొదలెట్టింది. 'ఇన్నాళ్ళకు చూడ ఎలా ఉంది?' లుంగీ కట్టుకుని అంతకు అయిదునిమి

గలిగినందుకు చాలా సంతోషంగా ఉందిట అతనికి — షార క్రితం గడ్డం చేసుకున్న బావతు సబ్బు చెవులపక్కం

మెడకింద అట్టలా పేరుకుని అక్కడక్కడ తెగిన రక్తపు చుక్కలతో వికృతంగా ఉంది. — తెగడ్డూ మరీ పొదుపుకోసం కొత్త బ్లేడు మానేస్తే? బనియను చిరుగు సరిగ్గా ముందుకే ఉండటంవల్ల తువ్వాలుతోటి కప్పుకుంటూ, జారిగాడు జారిపోతూఉంటే చంకలో ఇముడ్చుకుందుకు శతవిధాల ప్రయత్నంచేస్తూ, వేళ్ల సందున సగంకాలిన సిగరెట్‌నుంచి వచ్చే పొగకు కళ్ళు చికిలించి చూస్తూ వచ్చిన వ్యక్తిని గౌరవించే నిమిత్తం అర్థంలేని వెర్రినవ్వులాంటిది నవ్వుతున్న తనని చూడగలిగినందుకు సంతోషం కలగటం ఎలాఉన్నా బాధమాత్రం కలగవచ్చు. 'నువ్వుట్రా మా కమలానికి పుస్తె ముడేసిన దౌర్భాగ్యుడివి!' అని.

ఆఫీసర్ హోదాలో, ఫుల్‌సూటులో, కారు వేసుకుని వచ్చిన ఆ వ్యక్తి నా కమలకి బావ అని తెలిసిన క్షణంలో అతనిలో కలిగిన భావం ఇది. 'కమలకి అన్యాయం చేసేనేమో?'

ప్యూను వచ్చి, ''అయ్యగారు రమ్మంటున్నారు'' అన్నాడు.

కోపంగా చూశాడు వాణ్ణి, అయ్యగారిమీద చూపించలేని అక్కసునంతా కళ్లల్లో నింపి. వాడా ఊరుకునేది! తల ఎగరేసి ''అదేదో అరి దగ్గిర చూపండి'' అన్నాడు. అన్నవాడు ఆగేడా? పక్కవాళ్లవైపు తిరిగి ''భాస్కరంబాబుకు కోపంకూడా వస్తుందని నాకు తెల్దు'' అంటూ అదోకలాగున నవ్వాడు, 'మీకు కోపం వస్తే ఎట్లాగయ్యా?' అన్నట్టు.

''ఏమిటోయ్ ఈ తప్పులన్నీ?'' ఆఫీసర్ మందలింపుకు సంజాయిషీ చెప్పుకుని ఆ కాగితాలన్నీ మళ్లీ తెచ్చుకున్నాడు.

''ఏం బ్రదర్, మోటారుకు మించాయా దీవెనలు?'' పక్కవాడు ఉత్కంఠతో అడిగే ప్రశ్న.

''అబ్బే, భాస్కర్ అలాంటివి పట్టించుకోడుగా!'' రాజారావు లాలింపు.

''అయినా బాస్ అనదగువాడు, మనము పడదగువారము.'' ప్రమోషన్ లిస్టులో పేరుపడ్డ రామారావు తీర్మానం.

భాస్కరం ఎవరికీ జవాబు చెప్పలేదు. చెప్పమని

## వి. శకుంతల

వాళ్ళు అడగనూలేదు. వాళ్లల్లో వాళ్లే ప్రశ్నలు, జవాబులు, తీర్మానాలు, సంజాయిషీలు అనేసుకుని పావుగంటలో మళ్లీ ఎవరి పనుల్లో వాళ్ళు మునిగిపోయారు.

కాంటీన్‌లో కాఫీ తాగుతూ ఆలోచిస్తున్నాడు భాస్కరం.

'ప్రతివాడికీ అలుసే ఈ గుమాస్తాగిరీ! నాన్నకి తన ఈ ఉద్యోగంమీద ఒక నిరసనభావం. బి. ఎ. డిగ్రీతో ఇంతకంటే ఘనమైన ఉద్యోగం చెయ్యవచ్చని ఆయన ఉద్దేశ్యం. ఫలితాలు పడిన మరునాటినించే దరఖాస్తులు పెట్టించేటప్పుడుమాత్రం ఈ ఉద్దేశ్యం ఉన్నట్టు తోచదు. నిన్న ఆయన బజారునుండి ఇంటికి వచ్చేసరికి ఎదురుగా ఉన్న కారును, కొత్త వ్యక్తులను చూసి మొదట తెల్లబోయారుకాని చుట్టరికం తెలుసుకున్నాక ఆయన చూపించిన శ్రద్ధ, లీలగా ముఖంలో మెరుస్తున్న ఆనందం తను కనిపెట్టకపోలేదు. ఆ ఆనందం వెనక 'తన కొడుకుకూడా ఇంతటివాడు అయితే బాగుండునే' అనే ఆవేదన తన గుండెల్ని పిండినట్టయింది. అంతకంటే మరొక విషయం తనను సిగ్గుపడి తల వంచుకునేలా చేసింది. అతను కారు ఎక్కి ''వెళుతున్నా''మని, ''తప్పక మీరు రండి'' అని చెబుతున్నప్పుడు, నాన్న చూపించిన కంగారు — ''అయ్యో! ఎంతమాట! తప్పక వస్తాము. మీరు శ్రమ పడి రానక్కర్లే''దని వినయంతో చెప్పటం — సహా ప్రాంతం చిన్నవాడైన అతనిముందు వంగి వంగి విధేయత కనపరచటం — ఛీ! ఛీ! తనకి మనసు మూలిగినట్లైంది!

ఆమె కర్చీఫ్ ఊపుతూ ఫ్రంట్‌సీట్లోనుంచి కమలతో ''వెళ్లొస్తా''మని చెబుతూంటే తలుపు చాటున నిలుచున్న కమల ముఖంలోకి పరీక్షగా చూశాడు. ఆమె ముఖం తిప్పుకుని ఇంట్లోకి వెళ్లిపోయింది. నాన్నలాగే కమలకూడా వాళ్ల బావ హోదా జీవితం చూసి తన జీవితంలో వెలితి అనుభవిస్తోందా? ఏమో?

రాత్రి భోజనాల దగ్గిర నాన్న అన్నారు: ''ఒరేయ్ అబ్బాయీ! దేనికైనా పెట్టి పుట్టాలిరా. అంత చిన్న వయస్సులో ఎంత దర్జా బతుకు? ఇంటికే నూటపది రూపాయలుట! ఏమమ్మా కమలా, మీ బావ ఇంత అంతస్తులో ఉన్నాడని ఎప్పుడూ చెప్పలేదే?'' ఆదేదో విలువైన వస్తువు పోగొట్టుకున్నంత ఆత్రంగా అడిగారు. మజ్జిగ వడ్డనకి వచ్చిన కమల ముఖం జేవురించినట్టు తను గ్రహించాడు. చిన్నగా నవ్వేసి ఆమె లోపలికి వెళ్లిపోయింది.

''మీ బావ వాళ్లింటికి వెళదామా?'' అని సాయంత్రం తను అడిగితే తనవైపు అదోకలా చూసి, ''నేను రాను. మీరు వెళుతున్నారా?'' అన్నది. ''నాకు సుతరామూ ఇష్టంలేదు. కాని నాన్న ఒత్తిడి చేస్తున్నారు. ఎటూ ఆయన తెల్లవారుఝాము బండికి వెళ్లిపోతారు కనక ఒక్కసారి ఆయన చెప్పినట్టు వెళ్లివస్తే వదిలిపోతుంది. ముసలాయన మనసు కష్టపెట్టడమెందుకని...''

తను మాట పూర్తిచెయ్యకముందే కమల బదులేమీ చెప్పకుండా లోపలికి వెళ్లిపోయింది. యాంత్రికంగా నాన్నగారితో వాళ్లింటికి వెళ్లి వచ్చాడు. వచ్చిన దగ్గిరనుండి నాన్న ధోరణి తనకి బాధ కలిగిస్తూనే ఉన్నా ఊరుకున్నాడు. రాత్రంతా నిద్రపట్టలేదు. ఒకటే వేదన, ఆలోచన, బాధ.

'నాన్నకి తనొక ఆఫీసర్నైపోయి పెద్ద మేడలో ఉంటూ అమ్మా,నాన్నల ఆజ్ఞలు పాటిస్తూ అక్కయ్యని, బావని, పిల్లల్ని పండగలకు తీసుకువస్తూ, రాధ పెళ్లికి చేసిన అప్పు తీర్చేసి...' నిజమే అసలు ఆయన తమ ఇంటికి వచ్చిన పని దానిని గురించేగా? రెండేళ్ల క్రితం రాధ పెళ్లికి చేసిన నాలుగువేల అప్పు పూర్తిగా తీర్చనేలేదు. రాధకు ఇప్పుడు ఏడో మాసం. పురిటికి తీసుకురావాలి. అందుకనే ఆ పొలంకాస్తా అమ్మేసి అప్పు

(తరువాయి 61 వ పేజీలో)


ముచ్చట
అయిన
జుట్టు
రహస్యం...






అందంగా, ఒత్తుగా, పొడుగుగా కురులను పెంచుకొనడంలోగల రహస్యం క్రమం తప్పకుండా కేశపోషణ చేసుకొనడంలోనే గానుంది. తగిన తలనూనెను ఎన్నుకొనడంలోనే వుంది.

క్రమం తప్పకుండా వాడి అది జుత్తును రాలకుండా చేసి ఒత్తుగా పెంచగలదని తెలుసుకున్నవారే కలకత్తా కెమికల్‌వారి కాస్ట్రోల్‌ను ఎంచుకుంటారు.

కాస్టారాల్

మంచి సువాసనలీనే ఆముదపు నూనె

ది కలకత్తా కెమికల్ కం. లి.,
కలకత్తా-29.
దక్షిణ ఇండియా ఆఫీసు: 5/149, బ్రాడ్వే, మద్రాసు-1.

# అసమర్థుడు

(12 వ పేజీ తరువాయి)

తీర్చిద్దామని, తనతో చెప్పి పంతకాలు తీసుకువెళ్లాలను కుంటున్నానని చెప్పినప్పుడు 'మంచి పనే' అనుకున్నాడు. అంతకంటే చేసేది లేదు. పట్టణవాసంలో మధ్యతరగతి కుటుంబాల స్థితి ఎలాంటిదో అనుభవించేవాళ్లకేగాని తెలియదు. ఆనాడు రాధ పెళ్లికి పిలుపు దొరకని కారణంగా పెళ్లికి ముందురోజే దిగారు తను, కమల, చిట్టి. బంధువులందరూ అనుకున్నారు. 'ఏం కొడుకులో, కోడళ్లో? వీళ్లా ఉద్ధరించేది? పెళ్లివారితో సమంగా దిగారు బండి.'

తరవాత మాటలు తను వినదలుచుకోక పెరట్లోకి వెళ్లిపోయాడు. తన స్థితిగతులు విన్నా వాళ్లకి నచ్చవు. అందుకే ఏం మాట్లాడకుండా ఊరుకున్నాడు. తిరిగి మళ్లీ వచ్చాక ప్రతినెలా కొంత డబ్బు పంపిస్తున్నాడు. అలా పంపించడానికి ఎంత సతమతమవుతున్నారో వాళ్లకి తెలియదు. "మరి కాస్త సర్దుబాటు చెయ్యడానికి ప్రయత్నించకూడదా? కమలతో సంప్రతించాకే" అని అమధ్య నాన్న రాసిన జాబు చూస్తే ఏడుపులాంటి నవ్వు వచ్చింది. అక్కడి కేదో తను పంపగలిగేఉండి ఖార్చాదానుద్దైనట్టు —ఏమిటి వీళ్ల ప్రవర్తన?

సర్వర్ ఇచ్చిన బిల్లు కాగితాన్ని పట్టుకుని లేచాడు, వాస్తవంలోకి వచ్చిన భాస్కరం.

కాగితాల మధ్యనుంచి తలఎత్తి చూశాడు. ఎదటి సీట్లో సుదర్శనం కనిపించాడు. అతను తన తోటి క్లర్కేకాని ఎన్నడూ అతని ముఖంలో ఆ చాయలు కనిపించవు. ఇన్‌షర్టు వేసిన టెరిలిన్‌షర్టు, చిరునవ్వు చిందే ఆ ముఖం... ఎంత అదృష్టం? వెనక ఏమైనా ఆస్తి కలవాడు అవునో, కాదోగాని పెళ్లికి ఎదిగిన ఇద్దరు చెల్లెళ్లు, హైస్కూలు చదువులో ఉన్న తమ్ముడు అందరి కళ్లకి కనిపించే దరిద్రం తెలుసు. అయినా అతను ఎప్పుడూ చికాకు ఎరగని విలాసపురుషుడు. భార్యాపిల్లల్ని సినిమాలకి, షికార్లకి తిప్పగల అదృష్టవంతుడు.

తనకిమాత్రం అనిపించదు? ఎంచక్కా ఒక చిన్న బంగళా. మాట చెప్పగానే పనిచేసే నౌకర్లు. తను, కమల కార్లోనో, స్కూటర్‌మీదో షికారుకి వెళ్లి వచ్చేటప్పటికి పిల్లలకి అన్నాలు పెట్టి పడుకోబెట్టి, తమకోసం కాచుకుని కూర్చునే వంటావిడ. సిల్కుచీర విప్పే ఓపిక లేని కమల అలిసి భోజనం చెయ్యనని అలిగితే తను బ్రతిమాలి, "ప్లీజ్, కమ్ము...పోనీ ఈ గ్లాసు పాలు తాగెయ్యి. వద్దా? ... అయితే ఈ రెండు ఆపిల్ ముక్కలు...నే తినిపిస్తాగా!' అని అనాలి.

'ఊహే ఇంత మధురంగా ఉన్నది గదా. అనుభవం ఎంత ఆనందంగా ఉంటుంది? సరిగ్గా కమల వాళ్ల బావ దాంపత్యం ఇలాగే ఉంటుందేమో? కమల కూడా వాళాగే కలగని ఏమనుకుంటుంది? ఊం, ఏమను కుంటుంది? "నా జన్మలో ఈ కల నిజమయే భాగ్యం కూడానా?" అని అనుకుంటుంది. కుంగిపోతుంది. చాతకాని మొగుణ్ణి అనుకుంటుంది...వీల్లేదు. కమల మనస్సు వికలం కాకూడదు. ఆమె బాధపడకుండా తన సమర్థత చూపాలి...'

దృఢంగా నిశ్చయించుకుని గట్టి నిర్ణయానికి వచ్చాడు.

ఎన్నడు ఆలస్యంగా రాని భర్తని ఆశ్చర్యంగా చూసింది కమల.

"కమలా! చూడు, ఈ పాకెట్లలో చీరలున్నాయి. నచ్చాయేమో చూసుకో. బాగా లేకపోతే వాపసు ఇస్తానని చెప్పాలే. ఏరీ పిల్లలు? ఒరేయ్, బాబీ, ఏదీ నోరు తెరువు. ఆ...అదీ బాగుందా బిస్కట్లు? అమ్మా చిట్టీ, ఈ పట్టు పరికిణీగుడ్డ నీకు బాగుందా చూసుకో. ఆ బుట్టలో పళ్లున్నాయి. కోసి పెడతాలే. అరే! అదేమిటి కమలా అలా నిల్చుండి పోయావు! చీరలు చూడవేం?"

కమల పరీక్షగా భర్త ముఖంలోకి చూసి రెండు చేతులతో ముఖం కప్పేసుకుని బావురుమని ఏడ్చేసింది.

నిర్ఘాంతపోయాడు భాస్కరం!

కమల వెక్కి వెక్కి పడుతూనే చెప్పింది. "మీరింత బలహీనులవుతారనుకోలేదు. తమ స్థితిని ధైర్యంతో ఎదుర్కొనే మనోబలం కల భర్తగా మిమ్మల్ని చూసి ఇన్నాళ్లు గర్వించాను. స్తోమతు ఎరిగి జీవితాన్ని సరిదిద్దుకోగల నన్ను, మీరింత తేలికభావంతో అంచనా వేసుకున్నారా? మేడలు, కార్లే ఆనందం ఇవ్వగలవని, సాఫీగా, కులాసాగా ఉన్న మన సంసారంలో తృప్తి, ఆనందం లేవని ఎలా అనుకున్నారు? ఎన్నడైనా మనలో ఆ లోటు మచ్చుకైనా కనిపించిందా? ఈ కమల హృదయంలో మీరు చూడగలిగింది ఇంతేనా? స్కైకిల్‌కోసం దాచిన సొమ్ముతో ఈ బహుమానాలన్ని కొని, నన్ను మెప్పించాలనుకున్నారా? నన్ను మీరు అర్థంచేసుకో లేదని ఈనాడే తెలిసింది." పాకెట్లవైపైనా చూడకుండా ఆమె లోపలికి వెళ్లిపోయింది.

స్థాణువులా నిలబడ్డ భాస్కరం తెప్పరిల్లుకుని కుర్చీలో కూర్చుండిపోయాడు. చెల్లాచెదురుగా ఉన్న ఆ పాకెట్లమధ్య బాబీ, చిట్టి పోటీలుపడి బిస్కట్లు తింటూఉంటే నవ్వుకున్నాడు.

మనసులోమాత్రం అనుకున్నాడు: 'నిజం, కమలా, అందరిలాగే నిన్నూ భావించానుగాని నీ ఔన్నత్యాన్ని అర్థం చేసుకోలేకపోయాను. నన్ను క్షమించు. నీ భాస్కర్ అసమర్థుడు!' ★

# మన ఢిల్లీలేఖ

( 5 వ పేజీ తరువాయి)

పడమా? ఇదే ప్రస్తుత సమస్య. వాళ్లు తమ సంక్షేమం కోసం స్థాపించుకున్న సంఘాన్ని పోలీసు హక్కుల నిర్బంధాల చట్టాన్ని అక్షరాలా బహిరంగంగా అతిక్రమించే ఒక ట్రేడ్ యూనియన్ సంఘంగా మార్చివేసి, తమ అధికారులను అవమానపరచి, సభలలో అక్రమ చర్యలకు పురిగొల్పేవిధంగా ప్రసంగించి తద్విధంగా ప్రభుత్వంవారి ఆగ్రహానికి గురి అయ్యారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వంవారే కనుక వాళ్లను నిరాయుధులుగా చెయ్యడానికి నిర్ణయించకుండా ఉండినట్లయితే విషమ పరిస్థితులకు బాధ్యత తామే వహించవలసి వచ్చేది.

ప్రతిపక్ష నాయకులు కొందరు పోలీసువాళ్ల రహస్య సమావేశాల్లో ప్రసంగించారనీ, ట్రేడ్ యూనియన్‌గా ఏర్పడమని వాళ్లను ప్రోత్సహించినారని తెలుస్తున్నది. అద్యతన భావిలో తమకు అధికారం చిక్కుతుందని కలలోకూడా ఈ ప్రతిపక్షాల వారు అనుకోనిసమయం అది. అంటే జనరల్ ఎన్నికలకు ముందు ఈ విధంగా వారు పోలీసుల్ని ప్రోత్సహించారు. ప్రస్తుతం పరిస్థితి విపరీతంగా మార్పుచెందింది. ఇంచుమించు ప్రతిపక్షం ఏదో ఒక రాష్ట్రంలో అధికారం హస్తగతం చేసుకుంది. కాని, దేశ పరిపాలన అసాధ్యం అని రుజువు చెయ్యటమే తమ ప్రధాన ధ్యేయం అన్నట్లు ప్రతిపక్షాల వారు ఇంకా ప్రవర్తిస్తూనే ఉన్నారు. బహుశః ఇందుకు కారణం వాళ్లు గడిపిన చిరకాలాజ్ఞాతవాస ప్రభావమేకావచ్చు. కాలంగడిచిన కొలదీ వారు ఈ తపనమంచి విముక్తులు కావచ్చు.

పోలీసు సమ్మె సమస్య విషయంలో తాము ప్రజల సానుభూతిని కోల్పోయినట్లు ప్రతిపక్షనాయకులు ఇప్పుడు గ్రహించారు. ఈ దుస్థితిని పరిష్కరించడంలో శ్రీ చవాన్ నిర్దాక్షిణ్యంగా వ్యవహరించినందుకు ఆయనను అందరూ ప్రశంసించారు. కాంగ్రెసేతర రాష్ట్రప్రభుత్వాలుసైతం ఆయన చర్యకు హర్షం వెలిబుచ్చారు. ఇందుకు కారణం ఒకటే. ఆయనే కనుక ఢిల్లీ పోలీసుదళంలో క్రమశిక్షణను అమలు జరపడంలో అపజయం పొందిఉండినట్లయితే తమ కార్యక్రమాలకే ముప్పు వాటిల్లి ఉండును. అది వారికి తెలుసును.

—డి. సుబ్రహ్మణ్యం



మీ అభిమాన పబ్లిషరు మీకాలోచక్కని అవకాశం ఇస్తున్నారు
మే 31 లోగా
ఒక పోస్టుకార్డు(మీ ఆర్డరు) పంపినట్లయితే
సమాంతరరేఖలు (ఆంధ్రప్రభ వీక్లి సీరియల్)
పసుపులేటి మల్లిఖార్జునరావు 8-00 6-00
మృత్యుమందార (ఆంధ్రపత్రిక వీక్లి సీరియల్)
భూపతి 4-00 4-00
అందరకు తెలిసిన విషయం, పోస్టేజి ఉచితం
నవజ్యోతి పబ్లికేషన్స్
విజయవాడ